ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి సారించాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్
- పలు ఠాణాల సందర్శన


టూటౌన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశించారు. మంగళవారం ఆయన జిల్లా కేంద్రంలోని టూ టౌన్, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలు ఎస్పీకి పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఎస్పీ పోలీస్‌స్టేషన్ పరిసరాలు పరిశీలించారు. కేసుల వివరాలపై ఆరా తీశారు. ఠాణాలోని రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రమాదాలు జరగకుండా డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు యంత్రాంగం అహర్నిశలు పనిచేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. అన్ని పోలీస్‌స్టేషన్లలో రిసెప్షన్ మేనేజ్మెంట్ సక్రమంగా నిర్వహిస్తూ బాధితుల ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించే దిశగా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, సీఐలు కరుణాకర్‌రావు, ప్రణయ్‌కుమార్, ఎస్సైలు కే మహేందర్, కే విష్ణుప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

వదంతులు వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు

మత విద్వేషాలను రెచ్చగొట్టేలా సోషల్ మీడియాలో వదంతులను వ్యాప్తి చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్పీ అఖిల్ మహాజన్ ఓ ప్రకటనలో హెచ్చరించారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను ప్రజలు నమ్మవద్దని, సంయమనం పాటించాలని సూచించారు. అర్థరహితంగా, ఇతర వర్గాలను కించపరిచేలా ఎవరైనా సోషల్ మీడియాలో పోస్టులు పెడితే కేసులు నమోదు చేసి కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉంటూ మతవిద్వేషాలు రెచ్చగొట్టే వారిని గుర్తించి కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు అత్యవసర సమయంలో 'డయల్ 100'ను సంప్రదించాలని సూచించారు.

గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం

ఆదిలాబాద్‌టౌన్: గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం మోపుతామని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఐదుగురిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. గంజాయి అమ్మే వ్యక్తులతో పాటు గంజాయి పండించే, సేవించే వారిపై కేసులు నమోదు చేశారు. మంగళవారం వన్‌టౌన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ యువత గంజాయి మత్తుబారిన పడకుండా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. పట్టుకున్న వారి వద్ద నుంచి 35 గ్రాముల గంజాయి, 5 మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం కొత్తపేటకు చెందిన ఎ.వంశీకృష్ణ, అదే గ్రామానికి చెందిన కృష్ణపల్లి మల్లేశ్, ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని లింగగూడలో గంజాయిని పండిస్తున్న కుమురు మహాదు, గంజాయి సేవించిన ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన తుల్జపూరి అజయ్, అలాల్ తిరుమలేశ్‌లపై కేసులు నమోదు చేశామన్నారు. ఏ1, ఏ2, ఏ3లను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఆదిలాబాద్ వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్సై అశోక్ పాల్గొన్నారు.

వడగాలులపై వైద్యశాఖ అప్రమత్తం

- డీఎంహెచ్‌వో కార్యాలయంలో హెల్ప్‌లైన్
- బేలలో 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు


డాక్టర్ నరేందర్ రాథోడ్, డీఎంహెచ్‌వో

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో భానుడు భగ్గుమంటున్నాడు. రోజురోజుకు పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతూనే ఉన్నాయి. మంగళవారం జిల్లాలోని బేల మండలం చప్రాలలో 41.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 10 గంటలు దాటిందంటే బయటకు వెళ్లలేని పరిస్థితి ఎదురవుతుంది. సాయంత్రం 5 దాటినా ఎండ తీవ్రత తగ్గడం లేదు. ఎండ తీవ్రత, వడగాలుల కారణంగా ముందస్తుగా వైద్య శాఖ అప్రమత్తమైంది. జిల్లా కేంద్రంలోని వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి నరేందర్ రాథోడ్ తెలిపారు. వడదెబ్బకు గురైనా, ఎండ తీవ్రతకు సంబంధించి ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఉంటే హెల్ప్‌లైన్ నం.7670904306కు సమాచారం అందించాలని సూచించారు.

ముగిసిన ఎమ్మార్పీఎస్ దీక్షలు

కైలాస్‌నగర్: ఎస్సీల వర్గీకరణను అమలు చేయాలనే డిమాండ్‌తో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరసన దీక్షలు మంగళవారం ముగిశాయి. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీల వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించడంతో గత ఏడు రోజులుగా చేస్తున్న దీక్షలను ఎమ్మార్పీఎస్ నాయకులు విరమించారు. అనంతరం మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్, సిడాం రమ, రమంచ లక్ష్మి, గోవర్ధన్, లక్ష్మణ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

నార్నూర్: ఎస్సీ వర్గీకరణతోనే మాదిగల బతుకుల్లో వెలుగులు వస్తాయని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లపల్లి నవీన్ మాదిగ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో పాల్గొని మాట్లాడారు. నాయకులు సుదర్శన్, హనుమంతు, చిప్పకుర్తి విజయ్, శనిగరపు నారాయణ, మైలారం ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

ఏడో రోజుకు దీక్షలు..

బోథ్: అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ శాస్త్రీయ బద్ధంగా చేపట్టాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో చేస్తున్న నిరసన రిలే దీక్షలు మంగళవారం ఏడో రోజుకు చేరుకున్నాయి. దీక్షలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కుడాల స్వామి, కారెం రవి, అన్నెపాక అశోక్, అడ్డిగ స్వామి, రమణయ్య, నగేశ్, అనిల్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి


భోజనాన్ని పరిశీలిస్తున్న డీడీ జాదవ్ అంబాజీ

ఇచ్చోడ: ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఐటీడీఏ డీడీ జాదవ్ అంబాజీ అన్నారు. మంగళవారం మేడిగూడ ఆశ్రమ పాఠశాలను ఇచ్చోడ ఏటీడీవో శ్రీనివాస్‌తో కలిసి సందర్శించారు. పాఠశాల రికార్డులు, పరిసరాలు, వంటలు, స్టోర్ రూం పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పాఠశాల రికార్డులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలన్నారు. డీడీ, ఏటీడీవోలు బాధ్యతలు స్వీకరించి మొదటిసారిగా పాఠశాలకు వచ్చినందున సీఆర్టీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాదవ్ వినంత్‌రావు ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించారు.

ముగిసిన అంగన్‌వాడీల మహాధర్నా


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

కైలాస్‌నగర్: అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్రను కేంద్ర ప్రభుత్వం మానుకోవాలనే డిమాండ్‌తో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన 48గంటల మహాధర్నా ముగిసింది. సోమవారం రాత్రి కలెక్టరేట్ ఎదుట బస చేసిన అంగన్‌వాడీలు ఉదయం అక్కడే వంటావార్పు నిర్వహించారు. ముగింపు సందర్భంగా మంగళవారం కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించి గంటపాటు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షురాలు సునీత మాట్లాడారు. అంగన్‌వాడీల వేతనాలు పెంచేలా ఈ బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని కోరారు. కేంద్రం తెచ్చిన పీఎంశ్రీ పథకాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. 48గంటల పోరాటంతో ప్రభుత్వం దిగిరాకుంటే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ ఏవో రాంరెడ్డికి వినతిపత్రం అందజేశారు. జయలక్ష్మి, మంగ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలి

బజార్‌హత్నూర్: మోడల్ స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు బోర్డు పరీక్షలకు ప్రణాళిక బద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని జిల్లా క్రీడల అధికారి పార్థసారథి పదో తరగతి విద్యార్థులకు సూచించారు. మంగళవారం మండలంలోని జాతర్ల గ్రామంలో గల మోడల్ స్పోర్ట్స్ స్కూల్‌ను సందర్శించి తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులు కిషన్‌రెడ్డి, ఉపాధ్యాయులు సురేందర్, సంతోష్, భీంరావ్ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: పదో తరతగి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులు భయభ్రాంతులకు గురి కాకుండా ధైర్యంగా పరీక్షలు రాసి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. మంగళవారం ఉట్నూర్ బాలికల జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు.

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): పదో తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని జెడ్పీఎస్ఎస్ జైనథ్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మద్ది లస్మన్న అన్నారు. మంగళవారం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 135 మంది విద్యార్థులకు హాల్‌టికెట్లతో పాటు కలెక్టర్ సందేశం విన్పించారు. అనంతరం విద్యార్థులు చేసిన సంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ వెంకటమ్మ, ఉపాధ్యాయులు కృష్ణవేణి, దయానంద్ రెడ్డి, దేవన్న, రవీందర్, సంతోష్, ప్రశాంత్, ఆనంద్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన సేవా ఫౌండేషన్ సభ్యులు


ఎస్పీని సన్మానించి పూలమొక్క అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్‌ను సేవా ఫౌండేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో శాలువాతో సత్కరించి పూలమొక్క అందజేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు ఖాజా సిరాజొద్దీన్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన హోలీ పండగ శాంతియుతంగా జరిగేలా ఎస్పీ కృషి చేశారన్నారు. జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. బి.రమేశ్, రాజశేఖర్, ఇస్మాయిల్, సమీర్ ఖాన్, షేక్ జావిద్, ఆరిఫ్, సాజిద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన మహర్ సంఘం జిల్లా అధ్యక్షుడు..

బోథ్: జిల్లాకు నూతనంగా వచ్చిన ఎస్పీ అఖిల్ మహజన్‌ను మహర్ సంఘం జిల్లా అధ్యక్షుడు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ మెంబర్ కాంబ్లే భీంరావ్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. మహర్ సంఘం మహిళా అధ్యక్షురాలు సవిత బాయి, లక్ష్మణ్ రావు, సోషల్ వర్కర్స్ రామరావు పటేల్, మహర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ సావ్లే తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయిలో డిగ్రీ కళాశాల విద్యార్థులకు అవార్డులు

ఉట్నూర్‌రూరల్: ఆదిలాబాద్ జిల్లా తోటీలు -జీవన స్థితిగతులు అనే అంశంపై రాష్ట్రస్థాయిలో నిర్వహించిన జిజ్ఞాస ప్రాజెక్టుకు ఉట్నూర్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు అవార్డు రావడం అభినందనీయమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి. ప్రతాప్‌సింగ్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రాజెక్టు రూపకల్పనలో సహకరించిన తెలుగు అధ్యాపకులు యోగలక్ష్మి ప్రాజెక్టులో పాల్గొన్న విద్యార్థులు శంకర్, అంజలి, శిరీష, హారిక, గిరిజలను అభినందించారు.

కుష్ఠు సర్వే పరిశీలన

ఇంద్రవెల్లి: మండలంలోని ఇంద్రవెల్లి, సట్వాజి గ్రామాల్లో నిర్వహిస్తున్న కుష్ఠు సర్వేను జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసీ ప్రోగ్రాం అధికారి గజానన్ మంగళవారం పరిశీలించారు. ఆశ కార్యకర్తలతో మాట్లాడి పలు సూచనలు చేశారు. వ్యాధి లక్షణాలున్నవారు వెంటనే ఆశ కార్యకర్తలకు తెలుపాలని సూచించారు. వైద్యులు శ్రీకాంత్, సందీప్, డిప్యూటీ పారా మెడికల్ అధికారి వామన్ ఉన్నారు.

కుష్ఠు వ్యాధి సర్వేకు సహకరించాలి

ఉట్నూర్‌రూరల్: కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు ఉద్యమంలో భాగంగా ఈనెల 30వ తేదీ వరకు ఆశా కార్యకర్తలు నిర్వహిస్తున్న ఇంటింటా సర్వేకు ప్రజలు సహకరించాలని జిల్లా కుష్ఠు నివారణ అధికారి డాక్టర్ గజానన్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని పలు కాలనీలతో పాటు శ్యాంపూర్‌లో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. డిప్యూటీ పారా మెడికల్ అధికారి వామన్ రావు, రమేశ్, ఆరోగ్య పర్యవేక్షకులు నూర్‌సింగ్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బోరుకు ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న కాలనీవాసులు

బోథ్: మండల కేంద్రంలోని మైసమ్మ కాలనీలో గల చేతిపంపునకు కాలనీవాసులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలనీలో 30 ఏళ్లక్రితం బోరు వేశారు. అప్పటి నుంచి నేటివరకు కాలనీవాసులు చేతిపంపు ద్వారా నీటిని ఇళ్లలోకి తీసుకెళ్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో గ్రామంలో బోర్లు ఎండిపోయినా, తమ కాలనీలోని బోరులో నీరు ఎండిపోలేదని వారు పేర్కొంటున్నారు. 30 ఏళ్లుగా తమ దాహార్తి తీరుస్తున్న బోరుకు పూజలు నిర్వహించామన్నారు. అంజన రాము, పాలిక్ రమేశ్, బల్గం నవీన్, కొప్పుల భోజన్న, అల్లాడి శేఖర్, ప్రకాశ్, కిషన్, గంగాధర్, నహీం, కమల, భాస్కర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్, జగదీశ్‌రెడ్డి ఫ్లెక్సీ దహనం

కైలాస్‌నగర్: అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను అవమానపరిచేలా మాట్లాడిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రజాభవన్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, జగదీశ్‌రెడ్డిల ఫ్లెక్సీని దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు.

సంక్షిప్త వార్తలు

భక్తిశ్రద్ధలతో బాజీరావు బాబా సప్తాహం

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): భోరజ్ మండలం కామాయి గ్రామంలో బాజీరావు బాబా సప్తాహం ముగింపు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. చిన్నారులు గ్రా మంలో దేవత మూర్తుల వేషధారణలో అలరించారు. బాజీరావు బాబా చిత్రపటాన్ని పల్లకిలో ఊరేగించారు. భజనబృందాల సభ్యులు భక్తిగీతాలు ఆలపించారు.సామాజిక కార్యకర్త మానిష్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పెద్దలు ఉమేశ్ వైద్య, ప్రవీణ్ రెడ్డి, రూప్‌రావు, ప్రమోద్, రాజారెడ్డి, సుధాకర్, సతీశ్, అమూల్, పుంజరావు తదితరులు పాల్గొన్నారు.

తీసుకున్న రుణాలు చెల్లించండి

నేరడిగొండ: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో తీసుకున్న రుణాలను రైతులు ఈనెల 31వ తేదీలోగా వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేయించుకోవాలని సంఘ సీఈవో బారే నాగభూషన్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో పర్యటించారు. రైతుల వద్దకు వెళ్లి అవగాహన కల్పించారు. ఆయన వెంట పీఏసీఎస్ ఉద్యోగులు గంగయ్య, రజిని తదితరులు ఉన్నారు.

పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

బోథ్: రానున్న పండుగలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ వెంకటేశ్వర రావు అన్నారు. మంగళవారం సీఐ కార్యాలయ ఆవరణలో గ్రామస్తులతో శాంతి సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... రంజాన్, ఉగాది, హనుమాన్ జయంతి, శ్రీరామనవమి పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని తెలిపారు. ఎస్సై ఎల్. ప్రవీణ్ కుమార్, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగం సాధించిన యువకుడికి సన్మానం

తలమడుగు: మండలంలోని రుయ్యాడి గ్రామానికి చెందిన బిట్ల పెద్ద గంగన్న కుమారుడు బిట్ల చైతన్య హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించడంతో మంగళవారం మాజీ జెడ్పీటీసీ గోక గణేశ్ రెడ్డి, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. మాజీ సర్పంచ్ పోతారెడ్డి, సీఈవో మోతే శ్రీనివాస్, గోనెల గంగన్న, బిట్ల చిన్న గంగన్న, సంజీవరెడ్డి, కాంతారావు, వెంకటేశ్ యాదవ్ తదితరులు ఉన్నారు.

22న ఐటీఐలో జాబ్‌మేళా

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని ఐటీఐ కళాశాలలో తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈనెల 22న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస్ తెలిపారు. జిల్లాలో వివిధ ట్రేడ్‌లలో ఉత్తీర్ణులైన ఐటీఐ అభ్యర్థులు ఎస్సెస్సీ ఐటీఐ క్యాస్ట్, ఆధార్ కార్డు, పాస్‌ఫొటో, బయోడేటా ఫామ్, రెండు జతల సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలని పేర్కొన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ఆదిలాబాద్‌రూరల్: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను సోమవారం రాత్రి పట్టుకున్నట్లు ఆదిలాబాద్ రూరల్ ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సోమవారం రాత్రి చాందా (టి) జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో పెన్‌గంగా నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యార్థులు పొదుపును అలవర్చుకోవాలి

తాంసి: విద్యార్థి దశ నుంచే డబ్బులు పొదుపును అలవాటు చేసుకోవాలని అర్లి(టి) తెలంగాణ గ్రామీణ బ్యాంకు మెనేజర్ కిరణ్ రెడ్డి సూచించారు. మంగళవారం అర్లి(టి) పాఠశాలకు చెందిన 100 మంది విద్యార్థులకు బ్యాంక్ సేవింగ్ ఖాతాలను ప్రారంభించి విద్యార్థులకు అందజేశారు. ఉపాధ్యాయులు శ్రీకాంత్, రవికిరణ్, శైలిని ఉన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలని వినతి

బోథ్: బోథ్ మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్ రాజార్షిషాను కలిసి వినతిపత్రం అందించారు. గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరా పెంచాలని కోరారు. గుట్ట ప్రాంతాల్లోని గ్రామాలకు నీటి నిల్వలు పెంచడానికి చెక్ డ్యాంలు, కుంటలు ఏర్పాటు చేయాలన్నారు. కాగా మిషన్ భగీరథ అధికారులను, మండల ఎంపీడీవోలను తక్షణమే గ్రామాల్లోకి వెళ్లి ప్రజలకు తాగునీటి అవసరాలు తీర్చే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పసుల చంటి, బోథ్ పీఏసీఎస్ డైరెక్టర్ గొర్ల రాజు యాదవ్, షేక్ అబూద్, జ్యోతిరాం తదితరులు పాల్గొన్నారు.

మా భూమి రథయాత్రను విజయవంతం చేయాలి

ఆదిలాబాద్‌రూరల్: తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ రైట్స్–రాజ్యాధికార జేఏసీ, ధర్మ సమాజ్ పార్టీ సంయుక్తంగా డీఎస్పీ అధినేత డా విశారదన్ మహరాజ్ చేస్తున్న లక్ష కిలో మీటర్ల మా భూమి రథయాత్రను విజయవంతం చేయాలని తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ రైట్స్–రాజ్యాధికార జేఏసీ, , ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేశ్ మహరాజ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. డీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్, వివిధ మండల, జిల్లా నాయకులు ఉన్నారు.

'అబద్ధపు హామీలతో కాంగ్రెస్ మోసం'

బోథ్: అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలిచ్చి ప్రజలను మోసం చేసిందని బోథ్ బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు మేడిచెల్మ ప్రవీణ్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ హాస్టళ్లలో ఎంతో మంది చిన్నారులు మృతి చెందుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌పై కాంగ్రెస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు.

ఆదివాసీల సమస్యలు పరిష్కరించండి

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీ గిరిజనుల సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజర్షిషాను గొండ్వాన పంచాయితీ రాయిసెంటర్ ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. సామాజిక కార్యకర్త మెస్రం శేఖర్ బాబు మాట్లాడుతూ గాదిగూడ, నార్నూర్ ఉమ్మడి మండల్లాని పలు గ్రామాలకు రోడ్డు మంజూరు, వేసవికాలం తాగునీటి సమస్య పరిష్కారం తదితర సమస్యలు పరిష్కరించాలని కోరామన్నారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

భగత్‌సింగ్ వర్ధంతి పోస్టర్ ఆవిష్కరణ

ఆదిలాబాద్‌టౌన్: భగత్‌సింగ్ వర్ధంతి పోస్టర్లను పీడీఎస్‌యూ నాయకులు జిల్లా కేంద్రంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్ర అశోక్, పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆత్రం వినోద్‌లు మాట్లాడుతూ ఈనెల 18 నుంచి 23 వరకు భగత్‌సింగ్ వర్ధంతి సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 94వ వర్ధంతి సందర్భంగా రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థలు, పట్టణాలు, గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

అగ్రిమెంట్ ప్రకారమే చెల్లించాలి

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని సీడబ్ల్యూసీ గోదాం హమాలీలకు 2017లో చేసుకున్న అగ్రిమెంట్ ప్రకారమే కూలి చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం గోదాం ఎదుట కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎగుమతి బస్తాకు రూ.13, దిగుమతి బస్తాకు రూ.4.50, లారీ అసోసియేషన్ మామూలు రూ.1.50 ఇవ్వాలని చేసుకున్న అగ్రిమెంట్‌ను ప్రస్తుత కాంట్రాక్టర్ తగ్గించే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. గోదాం ముఖద్దాం దస్తగిర్, హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు సాంబాజీ, వసంత్ చౌహాన్, గోపాల్, అబ్దుల్ కలాం, బండు, అనిల్ పవర్, కపిల్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక రుగ్మతలపై ధూంధాం


మాట్లాడుతున్న ఎస్సై దివ్యభారతి

బేల: మండలంలోని సిర్సన్న గ్రామంలో సోమవారం రాత్రి సామాజిక రుగ్మతల నివారణకు పోలీసు కళజాత బృందం ఆధ్వర్యంలో ధూంధాం కార్యక్రమంలో నిర్వహించారు. కళాకారులు నాటికల రూపంలో సైబర్‌క్రైమ్, మత్తు పదార్థాల వినియోగంతో నష్టాలు, రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తత, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎస్సై దివ్యభారతి, మాజీ ఉపసర్పంచ్ కిష్టారెడ్డి, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు మల్లారెడ్డి, కాడే రూపేశ్, సురేశ్‌రెడ్డి, దీపక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మొక్కల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలి


నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో లక్ష్మణ్

ఇచ్చోడ: నర్సరీలో పెరుగుతున్న మొక్కల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని నర్సరీని ఆయన పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. రోజురోజుకూ పెరుగుతున్న ఎండల దృష్ట్యా మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రీన్‌మ్యాట్‌లు చినిగిపోకుండా చూసుకోవాలని పేర్కొన్నారు.

వ్యవసాయ సహకార సంఘం బలోపేతానికి కృషి


మాట్లాడుతున్న చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి

ఇచ్చోడ: రానున్న రోజుల్లో వ్యవసాయ సహకార సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు సభ్యులంతా కలిసికట్టుగా కృషి చేయాలని సహకార సంఘం చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం సహకార సంఘంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. సంఘంలో ఉన్న సభ్యులకు దీర్ఘకాలిక, స్వల్ప కాలిక రుణాలు ఇవ్వడానికి ఏకగ్రీవంగా తీర్మానించారు. ఉపాధ్యక్షుడు బద్దం పురుషోత్తంరెడ్డి, సంఘం కార్యదర్శి రాథోడ్ ఈశ్వర్, సభ్యులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

తాంసి: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య విద్యార్థులకు సూచించారు. కప్పర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. బాల కార్మికుల చట్టాలు, బాల్యవివాహాలతో పాటు ప్రభుత్వం బాలికలు, మహిళలకు కల్పిస్తున్న వసతులను తెలియజేశారు. హెచ్ఎం ఆనంద్, మాజీ సర్పంచ్ సదానంద్, మాజీ ఎంపీటీసీ సంతోష్, ఉపాధ్యాయులు కిష్టన్న, సంతోష్, విద్యార్థులు, గ్రామస్తులు తదితర సిబ్బంది ఉన్నారు.

తాంసి సబ్‌స్టేషన్‌కు నిలిచిన విద్యుత్ సరఫరా

తాంసి: మండలంలోని పొన్నారి గ్రామశివారులో పంట చేనులో మంగళవారం 33కేవీ లైన్ విద్యుత్ స్తంభం నేలకొరిగింది. విద్యుత్ స్తంభం విరిగిపడటంతో తాంసి సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. జొన్న పంటచేనులో విద్యుత్ స్తంభం విరిగిపోవడంతో మరమ్మతులు చేసేందుకు విద్యుత్‌శాఖ సిబ్బంది సైతం ఇబ్బందులు పడ్డారు. ఏఈ మనోజ్ కుమార్ సిబ్బందితో కలిసి కొత్త విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేసి మరమ్మతులు చేపట్టారు. అనంతరం విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

పీడీఎస్‌యూ రాష్ట్ర సదస్సులో జిల్లా నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: కాకతీయ విశ్వవిద్యాలయంలో మంగళవారం జరిగిన పీడీఎస్‌యూ రాష్ట్ర సదస్సులో జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సదస్సులో విద్యారంగ సమస్యలు, విశ్వవిద్యాలయం స్వయంప్రతిపత్తిని కా పాడే విషయమై చర్చించారు. సదస్సుకు జి ల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాయికుమార్, అశోక్, ఉపాధ్యక్షుడు మడావి రవి, చందన, పృథ్వీరాజ్, వినోద్, శ్రీజ, స్వాతి, సాధ న, మల్లేశ్, లోకేశ్, రవీందర్, రమ్య, చారి, పూజిత, మనోజ్, రాహుల్, హరికృష్ణ, ఫణీంద్ర, ఉమేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

పల్లకి శోభాయాత్ర

నార్నూర్: ఆధ్యాత్మికతతోనే మనశ్శాంతి కలుగుతుందని ప్రముఖ న్యాయవాది, గరీబ్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు బానోత్ జగన్ నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని ఉమ్రి గ్రామంలో గల సామకి మాత ఆలయంలో రామ్ మహరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక శోభాయాత్రలో పాల్గొన్నారు. బీజేపీ నాయకులు సీతారాం రాథోడ్, విజయ్ తదితరులు ఉన్నారు.

జిజ్ఞాస పోటీల్లో ప్రతిభ

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీల్లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచారు. ప్రభుత్వ పాలన, ఆరు గ్యారెంటీల అంశంపై నిర్వహించిన పరిశోధనలో బీఏ విద్యార్థులు ఆర్యన్, నవదీప్, ఆశిశ్, దిశశర్మ, వైష్ణవి, సుకన్య ప్రతిభ కనబరచగా ప్రిన్సిపాల్ రఘు అభినందించారు.